క్లుప్తంగా

క్లస్టర్ ఎంటీఎస్‌లకు పాఠశాలల కేటాయింపు



ఎంటీఎస్ ఉపాధ్యాయులకు పత్రాలు అందిస్తున్న ఎంఈఓ - 1 సామల

బలిజిపేట: క్లస్టర్ ఎంటీఎస్ ఉపాధ్యాయులు వారు కౌన్సెలింగ్‌లో కోరుకున్న క్లస్టర్ పరిధిలో ఉండే పాఠశాలల్లో విధులు నిర్వహించాలని ఎంఈఓ - 1 సామల సింహాచలం తెలిపారు. బలిజిపేట క్లస్టర్ పరిధిలో ఉండే ఉపాధ్యాయులకు క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటి నాయుడుతో కలిసి సోమవారం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ - 1 మాట్లాడుతూ..పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు మంగళవారం నుంచి విధులు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం ఇతరులకు స్ఫూర్తి

● హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి



పూర్వ విద్యార్థులు అందజేసిన కుర్చీలతో సిబ్బంది

సీతానగరం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు చేసిన సహకారం మరికొందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి అన్నారు. పాఠశాలలో 1996 - 97 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులకు ఉడెన్ చైర్స్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. మాధవి, పి. రామకృష్ణ, కొయ్యాన శ్రీరాములు, డి. రామారావు, జీవీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై ఎం. రాజేష్

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎం. రాజేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలు, చట్టాల అమలు, యువత చెడుమార్గం పట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

నందలో గ్రామసభ



మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

మక్కువ: మండలంలోని నంద గ్రామంలో ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి ఆధ్వర్యంలో జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆర్థిక సాధికారత సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ స్వరూపారాణి పరిశీలించారు.

ప్రజలకు అందుబాటులో సచివాలయ సిబ్బంది



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ స్వరూపారాణి

మక్కువ: మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి ఆదేశించారు. మండలంలోని పనసబద్ర సచివాలయాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

విత్తనశుద్ధితో పంటకు మేలు..

● తెగుళ్లను అరికట్టవచ్చు
● నాణ్యమైన దిగుబడి వచ్చే అవకాశం
● విత్తనాల నుంచి సంక్రమించే తెగుళ్లకు చెక్



పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

బలిజిపేట:

పంట సాగుకు ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని, దీంతో పంటలకు తెగుళ్ల నుంచి రక్షణ లభిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. నాణ్యమైన విత్తనాలు తీసుకోవడంతో పాటు ముందు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు వస్తాయి. అయితే చాలామంది రైతులు విత్తనశుద్ధిపై అవగాహన లేక తమకు తోచినట్లుగా వేస్తూ నష్టపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మంచి దిగుబడులు సాధించాలంటే విత్తనశుద్ధి చేయడంతో పాటు వ్యవసాయ శాఖాధికారుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటిస్తే.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు పొందవచ్చని వ్యవసాయాధికారులు, ఆదర్శ రైతులు చెబుతున్నారు.

లూజు విత్తనాలతో నష్టం..

రైతులు విత్తు కోసం వివిధ ప్రాంతాల నుంచి విత్తనాలను సేకరిస్తారు. ఈ విత్తనాల ద్వారా శిలీంధ్రాలు, బ్యాక్టీరియా, పురుగులు, తెగుళ్ల పంటకు ఆశించే అవకాశం ఉంది. అంతేకాకుండా విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ల వల్ల మొలకశాతం తగ్గి పంట కుళ్లిపోయే అవకాశం ఉంది. విత్తనశుద్ధి చేయడం వల్ల ఆరోగ్యకరమైన నారు, పంట వస్తుంది. మందుల పిచికారీ అవసరం కొంతమేర తగ్గడంతో పాటు పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. పైరుపై రసాయన ఎరువులను పిచికారీ చేయడం



విత్తనశుద్ధి చేస్తున్న రైతులు

కంటే విత్తనశుద్ధి చేయడం చాలా తేలిక. తక్కువ ఖర్చుతోనే మంచి ఫలితం పొందవచ్చు.

అధిక దిగుబడులు..

విత్తనశుద్ధి వల్ల ఎరువుల ఖర్చు బాగా తగ్గుతుంది. పైగా అధిక దిగుబడులు వస్తాయి. ముఖ్యంగా విత్తనాలకు ఉండే తెగుళ్ల, బ్యాక్టీరియా పోతాయి. మొలక శాతం ఎక్కువగా ఉంటుంది. విత్తనశుద్ధి చేసేటప్పుడు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి.

– శ్రావణ్‌కుమార్, ఏఓ, బలిజిపేట

విత్తనశుద్ధిలో జాగ్రత్తలు..

సూచించిన ముందులతోనే విత్తనశుద్ధి చేయాలి. మోతాదుకు మించి మందులు వాడరాదు. విత్తన శుద్ధి చేసేటప్పుడు విత్తనం పైపొర ఊడిపోకుండా జాగ్రత్తలు పాటించాలి. వేరుశనగ, పప్పుధాన్యాల విత్తనాన్ని ముందుగా శుద్ధి చేసి తర్వాత రైజోబియం కల్చర్ పట్టించాలి. విత్తనశుద్ధి చేసిన విత్తనాలను తినడానికి, పశువులకు ఉపయోగించకూడదు.

సాగు భూములకు హక్కు పత్రాలివ్వాలి

● జిల్లా వ్యవసాయ, కార్మిక సంఘ నాయకులు



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు, నాయకులు

సీతానగరం: మండలంలోని పేదలు, దళితులు, గిరిజనులు సాగుచేస్తున్న భూములకు సంబంధించి రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ, కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు సీహెచ్ కృష్ణారావు, సీపీఎం నాయకుడు రెడ్డి వేణు మాట్లాడుతూ.. బగ్గందొరవలస రెవెన్యూ పరిధిలో ఖాతా నంబర్ 1లో సబ్ డివిజన్ 1 నుంచి 20 వరకు గతంలో 16 ఎకరాల భూమిని ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో అర్హులైన 22 మంది లబ్ధిదారులకు హక్కు పత్రాలు (డి పట్టాలు) ఇచ్చారని తెలిపారు. ఆయా భూములకు రీ సర్వే నిర్వహించి, అప్పట్లో పట్టాలు పొందిన వారి కుటుంబ సభ్యులకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేసేవరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు గిరిజన గ్రామాల రైతులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్‌లో వన్‌బీ రావడం లేదు..

● ఆందోళన చేపట్టిన రైతులు



కలెక్టరేట్ వద్ద పాస్‌పుస్తకాలు చూపిస్తూ నిరసన తెలియజేస్తున్న రైతులు

పార్వతీపురం రూరల్: వెబ్‌ల్యాండ్‌లో భూములకు సంబంధించిన వన్‌బీ రావడం లేదని మక్కువ మండలానికి చెందిన శాంతేశ్వరం గ్రామ రైతులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద పాస్ పుస్తకాలు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జగనన్న భూరక్ష కార్యక్రమంలో భాగంగా భూ సర్వే నిర్వహించి 2023లో పాస్ పుస్తకాలు పంపిణీ చేశారన్నారు. దీంతో రైతులందరూ పాసుపుస్తకాల వివరాలతో బ్యాంక్‌లో రుణాలు పొందారని.. ప్రస్తుతం ఆ రుణాలను రెన్యువల్ చేసుకునేందుకు వన్‌బీలు రావడం లేదని చెప్పారు. వన్‌బీలు సకాలంలో ఇచ్చి రుణాలను రెన్యువల్ చేసుకోకపోతే తమపై వడ్డీ భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వన్‌బీలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టాలిచ్చి ఆదుకోండి..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు

పాచిపెంట: దశాబ్దాల కాలంగా గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు జర్నీ రామయ్య, చెల్లూరి జగన్నాథం, కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుడుమూరు, కొండతాడూరు గ్రామాల రైతులకు పట్టాలు మంజూరు చేయడంలో అధికారులు తాత్సారం వహించడం సరికాదన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ.. అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికీ పది ఎకరాలకు సంబంధించి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు.

పట్టాలు మంజూరు చేయండి..

సాలూరు: అటవీ, బంజరు భూములకు పట్టాలిస్తామని సర్వేలు చేపట్టి ఇంతవరకు పట్టాలు మంజూరు చేయకపోవడం దారుణమని ఆదివాసీ, గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సుందరరావు, ఘాసి, తదితరులు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంటనే గిరిజన రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మర్రి శ్రీనివాసరావు, గౌయ్య, సన్యాసి, గంగయ్య, జోగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి చినమేరంగి విద్యార్థిని

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పెళ్లూరు వర్షకు ట్రిపుల్ ఐటీ నూజివీడుకు ఎంపికైంది. పదో తరగతిలో 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవడంతో ట్రిపుల్ ఐటీ సీట్ వచ్చిందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.



పెళ్లూరు వర్ష

సాలూరులో

సాలూరు: పట్టణంలోని జ్యోతిరావు పూలే, గాడివీధి, తదితర ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. జ్యోతిరావుపూలే పాఠశాల నుంచి 9 మంది విద్యార్థినులు, గాడివీధి కేఎఎస్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన అల్లు రేష్మ, నాయుడు దుర్గ నూజివీడు, పులివెందుల ట్రిపుల్ ఐటీలకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ముగ్గురు విద్యార్థులు..

సీతానగరం: మండలంలోని నిడగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. హెచ్‌ఎం ఎస్‌ఎల్ పాత్రుడు మాట్లాడుతూ.. భోగి హాసిని, కేతల ప్రవీణ్, రాయిపిల్లి ప్రజ్ఞ ట్రిపుల్ ఐటీ కాలేజీల్లో సంపాదించారన్నారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు.



సీతానగరం: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి..

సీతానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న స్థానిక గూడెం వీధికి చెందిన బంక శ్రావణి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ మేరకు విద్యార్థినిని హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.



బంక లక్ష్మి

పీఏసీఎస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: పీఏసీఎస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ (పీఏసీఎస్) ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు ఆర్ సత్యారావు, ఏఐటీయూసీ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. జీతాలు పెంచడంతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి. పాండురంగారావు, సిరిపురపు నారాయణరావు, హరీష్, పి. నాగభూషణరావు, గొర్లి చంటి, సింహాద్రి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



శానిటేషన్ అధికారికి సమ్మె నోటీస్ అందజేస్తున్న యూనియన్ నాయకులు

సాలూరు: లేబర్ కోడ్‌ల రద్దు.. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం, తదితర డిమాండ్లతో వచ్చే నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి మున్సిపల్ శానిటేషన్ అధికారి బాలకృష్ణకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు సోమవారం నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులందరికీ తల్లికి వందనంతో పాటు అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలుచేయాలని.. ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం జీతాలు పెంచి చెల్లించాలని కోరారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల ఏర్పాటు చేయండి

పార్వతీపురం: ఐటీడీఏ ఆధ్వర్యంలో పార్వతీపురం జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఏర్పాటు చేయాలని గిరిజన సంఘ నాయకులు పల్ల సురేష్, పాలక రంజిత్‌కుమార్, అరిక చంద్రశేఖర్, రామకృష్ణ, తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా పరిధిలోని ఆంధ్ర గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని పార్వతీపురం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేసి, ఇటువంటి అక్రమ డిప్యుటేషన్లను తక్షణమే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బంగారాజు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

30 మందికి ఉద్యోగావకాశాలు

సాలూరు: పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 30 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ ఫార్మా కంపెనీ నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 50 మంది నిరుద్యోగులు హాజరు కాగా 30 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ మేరకు ఉద్యోగాలు పొందిన వారిని కళాశాల సిబ్బంది అభినందించారు.

ఆకలితో అలమటించారు..

పార్వతీపురం: విశాఖపట్నంలో ఎంతో ఆర్భాటంగా నిర్వహించిన యోగాంధ్రలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు ఆకలితో అలమటించారని సీఐటీయూ జిల్లా కార్యదర్శులు బీవీ రమణ, జీవీ రమణ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో వారు మాట్లాడుతూ.. పార్వతీపురం నుంచి 44 మంది కార్మికులు వెళ్లగా వారికి వసతి, భోజన సదుపాయం కల్పించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సూరిబాబు, గంగరాజు, శివ, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలివెళ్లిన నాయకులు



పార్వతీపురం బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు

సీతానగరం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిర్వహించిన యువతపోరుకు మండలం నుంచి అధిక సంఖ్యలో యువత బయలుదేరింది. మండల కార్యాలయ ఆవరణలో పలు ఆటోల ద్వారా పార్వతీపురం బయలుదేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు డి. కిశోర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, పెదబోగిలి, తామరఖండి, వెంకటాపురం ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సాలూరు నుంచి..

సాలూరు: జిల్లా కేంద్రంలో సోమవారం చేపట్టిన యువతపోరు కార్యక్రమానికి సాలూరు నియోజకవర్గం నుంచి పలువురు బయలుదేరారు. మాజీ మంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత వాహనాల్లో జిల్లా కేంద్రానికి వెళ్లారు. నిరుద్యోగులను కూటమి సర్కారు మోసం చేసిందని పలువురు మండిపడ్డారు.



సాలూరు: యువత పోరుకు బయలుదేరిన యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

సీతానగరం: మండలంలోని సచివాలయ సర్వే సహాయకుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మన్మధరావు, వి. లావణ్యకుమార్, ఎస్. రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన పాలకులు ఇంతవరకూ పట్టించుకోలేదన్నారు. తమపై పనిభారం ఎక్కువగా ఉన్నా, తమను పట్టించుకోవడం లేదన్నారు. అలాగే బదిలీల్లో కూడా తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ఎంఎల్‌ఎస్ ప్రసాద్, డీటీ ఉమామహేశ్వరరావులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామ సర్వేయర్లు

సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దాలమ్మ

బలిజిపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ వచ్చే నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్ల నాయకురాలు దాలమ్మ కోరారు. సోమవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని ఆరోపించారు. ఆయా కోడ్‌ల వల్ల తమ సమస్యలపై నిరసన తెలిపే హక్కును కూడా కోల్పోతామని చెప్పారు.కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ చేపడుతున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. అలాగే మన్యం జిల్లాలో ఈ నెల 25, 26, 27 తేదీలలో జీపుజాతా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు, ప్రజా సంఘాల నాయకులు వి.లక్ష్మి, ఇందిర, సావిత్రి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గంగురేగువలసలో సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

● సీపీఐ నాయకులు

పార్వతీపురం రూరల్: మండల పరిధిలోని గంగురేగువలస పంచాయతీలో క్యాన్సర్ వ్యాధి లక్షణాలున్న నేపథ్యంలో వైద్యసిబ్బందితో పరిశీలన జరిపి సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కోట జీవన్న మాట్లాడుతూ.. ఈ పంచాయతీ పరిధిలో ఏడేళ్ల కిందట ప్రైవేట్ పురుగుల మందుల తయారీ నిమిత్తం కేంద్రాన్ని నిర్మించారన్నారు. ఆ కేంద్రం నుంచి వచ్చిన వ్యర్థాలు భూమిలోకి చేరి భూగర్భ జలాలు విషపూరితమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 12 మంది క్యాన్సర్ బారిన పడి మృతి చెందారని.. మరో పది మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారని చెప్పారు. క్యాన్సర్ ఎందుకు ప్రబలిందో అధికారులు నిగ్గు తేల్చాలన్నారు. ప్రభుత్వ వైద్యారోగ్య సిబ్బంది మాత్రం కేవలం ముగ్గురు మాత్రమే క్యాన్సర్ రోగులు ఉన్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, రైతు సంఘ నాయకులు

దుర్వాసన వస్తోంది..

పురుగు మందుల కేంద్రం నుంచి దుర్వాసన వస్తోందని రైతులు ఆరోపించారు. దీంతో వ్యవసాయ పనులు చేపట్టేందుకు కూలీలు ఎవ్వరూ ముందుకు రావడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి పురుగు మందుల కేంద్రాన్ని మూసివేయాలని కోరారు. అనంతరం డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ విద్యా సంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం టౌన్: గాయత్రీ విద్యాసంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ హేమలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరఘట్టం మండల కేంద్రంలోని గాయత్రి స్కూల్ నిర్వాహకులు తమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులకు ఈ ఏడాది సైనిక్ స్కూల్‌లో సీట్లు వచ్చినట్లు తప్పుడు ప్రచారం చేశారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసేందుకు ప్రచారం చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వికాస్, చరణ్, గణేష్ పాల్గొన్నారు.



డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కాలువల షట్టర్లకు మరమ్మతులు చేపట్టాలి

పార్వతీపురం టౌన్: తోటపల్లి బ్యారేజ్ వద్ద పాతకుడి, ఎడమ కాలవల షట్టర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్‌ఓ హేమలతను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షట్టర్లు పాడైన విషయం రెండు నెలలుగా చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పనులు చేపట్టి ఖరీఫ్‌కు సాగునీరు అందించాలని కోరారు.



డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు